## క్లుప్తంగా

### దృష్టి లోపం నివారణకే 'కంటి వెలుగు'



పరీక్షిస్తున్న కంటి వైద్యుడు భాస్కర్

బొమ్మనహాళ్: దృష్టి లోపాన్ని దూరం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని కంటి వైద్యుడు భాస్కర్, వైద్యాధికారిణి శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని ఉద్దేహాళ్ ఆరోగ్య ఉప కేంద్రంలో కంటి వెలుగు పథకంలో భాగంగా 23 మందికి దృష్టి శాతాన్ని పరీక్షించి, మందులు అందజేశారు. అనంతరం కంటి చూపు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### తక్షణసాయం అందజేత

కూడేరు: మండలంలోని చోళసముద్రంలో బుధవారం హరిజన నాగభూషణ మృతి చెందాడు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం వర్తించింది. దీంతో సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నేతలు గురువారం మృతుని భార్య మేరీలతకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సచివాయల ఉద్యోగులు ప్రవీణ్, తిప్పేస్వామి, ఓబుళమ్మ, గంగాధర్, వైఎస్సార్‌సీపీ నేతలు పెన్నహోబులేసు, శివ, గంగాధర్, వంశీ, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా మహేష్



ఉరవకొండ: ఏపీ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా వశికేరి మహేష్‌ను నియమిస్తూ గురువారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోపీకృష్ణ ఉత్తర్వులు వెలువరించారు. గతంలో నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ ఎర్రిస్వామిరెడ్డి ఉన్నత కోర్సులకు వెళ్లడంతో ఆ పదవి ఖాళీ ఏర్పడింది. దీంతో నియోజకవర్గ ఉద్యోగ సంఘం సభ్యుల ఏకగ్రీవ తీర్మానం మేరకు ఉరవకొండ మండల గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వశికేరి మహేష్‌ను అధ్యక్షుడిగా నియమించారు. తన ఎంపికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ, కార్యదర్శి రామునాయక్, ఉరవకొండ ఎంపీడీఓ చంద్రమౌళి, నియోజకవర్గ యూనియన్ సభ్యులకు నూతన అధ్యక్షుడు మహేష్ ధన్యవాదాలు తెలిపారు.

### పోలీస్‌స్టేషన్ తనిఖీ



మాట్లాడుతున్న డీఎస్పీ బి. శ్రీనివాసులు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. మండలంలో శాంతిభద్రతలు, పెండింగ్ కేసులపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణా, మట్కా, పేకాట, జూదంపై నిఘా పెంచాలని, గ్రామాల్లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి పూట పోలీస్ గస్తీ పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ పరుశురాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

### 21న గుండె వైద్యశిబిరం

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21న ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ గుండె నొప్పితో బాధపడుతున్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### బైక్ బోల్తా .. ఒకరికి గాయాలు

కళ్యాణదుర్గం: మండలంలోని హులికల్లు గ్రామ సమీపంలో గురువారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తా పడి గుమ్మఘట్ట మండలం గలగలకు చెందిన బోయ పాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. భార్య కాన్పు కోసం కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రిలో అడ్మిటవడంతో స్వగ్రామం నుంచి ఆస్పత్రికి వస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు 108లో అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు.

**కారు ఢీకొని ..**

కూడేరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వద్ద అనంతపురం –బళ్లారి ప్రధాన రహదారిపై గురువారం రాత్రి కటిక రామోజీరావును కారు ఢీకొంది. దీంతో అతడు గాయపడ్డాడు. అతడు రోడ్డు దాటుతుండగా ఉరవకొండ నుంచి అనంతపురం వెళుతున్న కారు ఢీకొంది. 108లో క్షతగాత్రున్ని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

### సర్మస్ హుసేన్సీ దర్గాలో ఫాతేహాలు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్సీ దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు.

# ముంపు బాధితుల కల నెరవేరిన వేళ

- మైలారంపల్లి ముంపు బాధితులకు ప్లాట్ల కేటాయింపు
- ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ
- సొంత పంచాయతీ ప్రజల బాధలు పట్టించుకోని ఎమ్మెల్యే కేశవ్



ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులతో మైలారంపల్లివాసులు

ఉరవకొండ: దశాబ్దాల కాలం పాటు పెన్నహోబిలం బ్యాలెన్స్ రిజర్వాయర్ (పీఏబీఆర్) బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురై గ్రామస్తులు అనేక అవస్థలు పడ్డారు. ఇళ్లల్లోకి నీరు చేరి నెలల తరబడి రాత్రింబవళ్లు చెట్ల నీడన పిల్లాపాపలతో గ్రామస్తులు తలదాచుకున్నారు. ఏళ్ల తరబడి వారి బాధలను కౌకుంట్ల పంచాయతీ షావుకారులు పట్టించుకోలేదు.మండలంలోని కౌకుంట్ల పంచాయతీలోని మైలారంపల్లి పీఏబీఆర్ బ్యాక్ వాటర్‌తో గత కొన్నేళ్ల నుంచి ముంపునకు గురవుతోంది. గతంలో పలుమార్లు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ముంపు గ్రామంలో పర్యటించి ప్రజల బాధలను తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముంపు గ్రామాన్ని ఆదుకుంటామని.. ప్రజలకు మరోచోట స్థలాలు మంజూరు చేసి పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని గ్రామస్తులకు అప్పట్లో హామీ ఇచ్చారు.

**పట్టాలు పొందిన వారికి ప్లాట్ల కేటాయింపు**

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కృషి ఫలితంగా ఇంటి పట్టాలు పొందిన మైలారంపల్లి ముంపు గ్రామస్తులకు గురువారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకుల సమక్షంలో పండుగ వాతావరణం మధ్య ప్లాట్లు కేటాయించారు. పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి అశోక్, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, ఏసీ ఎర్రిస్వామి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరంబాషా, ఉలిగన్న, రాకెట్ల నాగరాజు, శ్రీనివాసులు, గ్రామ నాయకులు ఇమాం, ఆల్లాబకష్, ఖాసీం, లాలు స్వామి, కర్రెన్న ఆధ్వర్యంలో అధికారులు లబ్ధిదారులకు పాట్లు కేటాయించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరు, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కృషి ఫలితంగా తమకు పట్టాలు అందాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

**మాట నిలుపుకున్న విశ్వ**

పీఏబీఆర్ బ్యాక్‌వాటర్ కారణంగా ముంపునకు గురైన మైలారంపల్లి గ్రామస్తుకు ఇళ్ల పట్టాలు ఇస్తామని ఇచ్చిన హామీని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నిలుపుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి గ్రామస్తులకు వారి కోరిన చోట స్థలాన్ని కేటాయించి 63 మందికి పట్టాలు అందించి, ప్లాట్లు కేటాయించారు. దీంతో పాటు ఎమ్మెల్యే కేశవ్ సొంత పంచాయతీలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి పేదలకు సొంత ఇళ్లు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేసి ఆయా గ్రామస్థుల చేత మన్నలు పొందుతున్నారు.

**కౌకుంట్ల పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే కేశవ్ మొండిచెయ్యి**

ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఏ రోజూ సొంత పంచాయతీ కౌకుంట్ల పై దృష్టి పెట్టలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సొంత గ్రామంలో ఇప్పటికీ రోడ్లు, డ్రైనేజీలు కుడా లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కౌకుంట్ల పంచాయతీ పరిధిలోని మైలారంపల్లి ముంపు గ్రామాన్ని కూడా పట్టించుకోలేదన్న ఆపవాదు భుజాన వేసుకున్నారు. గతంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా పనిచేసినా మైలారంపల్లి గ్రామస్తులకు ఇంటి పట్టాలు ఇప్పించడంలో కేశవ్ పూర్తిగా విఫలమయ్యారు.

**జగనన్నకు రుణపడి ఉంటాం**



ఎన్నో ఏళ్లుగా డ్యాం నీటితో అవస్థలు పడుతున్నా.. మా బాధలు ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వంలో నాకు పట్టాతో పాటు పక్కా ఇల్లు కూడా అధికారులు మంజురు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విశ్వ అన్నకు రుణపడి ఉంటాం.

– హేమావతి, మైలారంపల్లి

**కల సాకారమైంది**



ఎన్నో ఏళ్ల మా కల సాకారం అయింది.. గ్రామంలో విశ్వ అన్న పర్యటించి మా బాధలు గుర్తించి ఇచ్చిన మాట ప్రకారం ఇంటి పట్టాతో పాటు ప్లాట్లు కూడా అందజేశారు. త్వరలో ఇల్లు కూడా నిర్మించి ఇస్తామన్నారు. విశ్వన్నకు గ్రామస్తులంతా అండగా ఉంటాం.

– గౌరీ, మైలారంపల్లి

### నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుదేవనహళ్లి, తారకాపురం గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె. ఈశ్వరరెడ్డి గురువారం తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు, నాయకులు హాజరుకావాలన్నారు.

### బాబు వైఖరికి నిరసనగా నేడు ర్యాలీ

రాయదుర్గం: అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే, ఆ స్థలాల్లో శవాలు పాతిపెట్టాలని అపహాస్యం చేసేలా మాట్లాడిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వైఖరికి నిరసగా శుక్రవారం శాంతియుత ర్యాలీ, నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని విప్ కాపు రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం నుంచి వినాయక సర్కిల్ వరకూ ర్యాలీగా వెళ్లి బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తామన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పేద ప్రజలంతా ర్యాలీకి మద్దతుగా నిలవాలని విప్ విజ్ఞప్తి చేశారు.

## క్రీడలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న పట్టణ సీఐ తేజమూర్తి

కళ్యాణదుర్గం: క్రీడలతో విద్యార్థులకు భవిష్యత్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని పట్టణ సీఐ తేజమూర్తి అన్నారు. స్థానిక జ్ఞానభారతి ప్రైవేట్ విద్యాసంస్థల క్రీడా మైదానంలో గురువారం జూడో టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. ఉపాధి అవకాశాలకు క్రీడలు ఎంతో కీలకంగా మారాయన్నారు. క్రీడలతో ఎంతో మంది ఉద్యోగులుగా స్థిరపడ్డారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ మల్లికార్జున, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభి, అడ్వకేట్ బీటీ రామాంజనేయులు, గోళ్ల సూరి, టోర్నమెంట్ అబ్జర్వర్ జయసింహ, జూడో అసోసియేషన్ కార్యదర్శి జి.లక్ష్మినారాయణ, సీఈఓ బాబు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి కిరణ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## 'నాడు- నేడు' పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న అధికారులు

బ్రహ్మసముద్రం: మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు అభివృద్ధి పనులను మరింత వేగవంగం చేయాలని ఎంపీడీఓ వెంకటనాయుడు, స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ బాలకిషన్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలో నాడు –నేడు ఫేస్–2కు సంబంధించి పనుల వివరాలపై ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. వారు మాట్లాడుతూ జూన్ 10 నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనులు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి సందేహాలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో 'నాడు- నేడు' ఇంజినీర్ సాయిరాం , ఎంఈఓ ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న డీడీ కె.తిప్పేస్వామి

వజ్రకరూరు: విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ కె. తిప్పేస్వామి అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కింద మండలానికి సరఫరా అయిన మెటీరియల్‌ను పరిశీలించారు.అనంతరం మండలంలో ఉన్న విద్యార్థులు, పాఠ శాలలు తదితర వివరాలు తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. నాణ్యమైన భోజనం అందించడంతోపాటు జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు కిట్లు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎర్రిస్వామి, హెచ్ఎం నాగేంద్రప్ప, ఏపీఎం వీరనారప్ప, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## చేసిన ప్రతి పనికీ వెంటనే బిల్లు మంజూరు

వజ్రకరూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించి, మంజూరైన పనులను పూర్తి చేయాలని, చేసిన ప్రతి పనికీ బిల్లులు వెంటనే మంజూరు అవుతాయని పంచాయతీ రాజ్ నియోజకవర్గ డీఈ అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన వాటిలో మండలానికి 64 పనులు మంజూరు కాగా మరికొన్ని మంజూరు కావాల్సి ఉందన్నారు. ప్రతి గ్రామ సచివాలయానికీ రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమ ంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, బీసీసెల్ జిల్లా కార్యదర్శి వశికెరి రమేష్, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీ సుంకమ్మ, పీఆర్ జేఈ మణిభూషన్, టీఓ మురళి, మండల సర్పంచులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### తాగునీటి పైపులైన్‌కు మరమ్మతు

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం గ్రామానికి పీఏబీఆర్ డ్యాం వద్ద ఉన్న సీపీడబ్ల్యూఎస్ పథకం నుంచి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. 15 రోజుల క్రితం ఆ గ్రామం వద్ద పైపులైన్ దెబ్బతిని లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా పారేది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సాక్షి దిన పత్రికలో గురువారం 'తాగునీరు వృథా' అనే శీర్షికనతో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా, సూపర్‌వైజర్ మంజునాథ్‌రెడ్డి దెబ్బతిన్న పైపులైన్‌కు మరమ్మతు చేయించారు. తాగునీటి వృథా ఆగడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

శెట్టూరు: ఉపాధి పథకంలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ ద్వారా పండ్ల మొక్కల సాగుకోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గంగావతి తెలిపారు. ఐదు ఎకరాల్లోపు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. మామిడి, చీని, దానిమ్మ, సపోట, నేరేడు తదితర పండ్ల మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రైతులు 1బి, చిన్న, సన్నకారు ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా, ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులతో ఏపీఓ రమేష్‌ను సంప్రదించాలన్నారు.

**రైతులకు సదవకాశం**

గుమ్మఘట్ట: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన రైతులకు పండ్ల మొక్కలు అందిస్తున్నట్లు ఏపీఓ సురేశ్ తెలిపారు. జామ, మామిడి, దానిమ్మ, నేరేడు, చీనీ, మునగ, అంజూరా, మల్లెపూల మొక్కలు వేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఐదు ఎకరాలలోపున్న సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### గుండెపోటుతో ఉప సర్పంచ్ మృతి



పెద్దిరెడ్డి(ఫైల్)

బెళుగుప్ప: మండలంలోని నక్కలపల్లికి చెందిన ఉప సర్పంచ్ చిలకల పెద్దిరెడ్డి(58) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి మండల, స్థానిక నాయకులతో కలసి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఉప సర్పంచ్ భార్య లలిత, కుమారుడు అమర్‌నాథ్‌రెడ్డి, కూతురు గీతాంజలిని పరామర్శించి, అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాస్, సర్పంచ్ ఊరువాకిలి రామిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ ఉపాధ్యక్షుడు పాటిల్ నాగిరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, కరుణాకర్, గోవిందరెడ్డి, పాతన్న, నరిగన్న, పంచాయతీ సెక్రటరీ శ్రీరాములు పాల్గొన్నారు.

### రికార్డుల మార్పుల్లో పారదర్శకత అవసరం

కుందుర్పి: రైతులకు సంబంధించి సాగు భూముల మార్పులు, చేర్పుల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని తహసీల్దార్ విజయకుమారి, డీటీ తిప్పేస్వామి సూచించారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందికి భూముల ఆన్‌లైన్ నమోదు, ముటేషన్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిజిస్ట్రేషన్, పారదర్శకంగా ఉన్న పాత పట్టా భూములకు మాత్రమే ముటేషన్లు తీసుకుని గ్రామాల్లో రైతులను విచారించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ, కొండ, గుట్టపొరంబోకు భూములకు ఎట్టి పరిస్థితిల్లో మార్పులు, చేర్పులు చేయవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముటేషన్లు చేస్తే జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ కుళ్లాయప్ప, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

### ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం: పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన కురుబ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు శ్రీ కనకదాస ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని ఆ సంఘం అధ్యక్షుడు కె.నాగరాజు, కార్యదర్శి పాండురంగ, శివశరణ, కారుమంచి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులను మే 30లోగా సంఘ సభ్యులకు అందజేయాలన్నారు.

## రైతులకు 'వైఎస్సార్ జలకళ' వరం



షేక్షానపల్లిలో వైఎస్సార్ జలకళ మోటార్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జలకళ పథకం పేద రైతులకు ఓ వరమని నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని షేక్షానపల్లిలో వైఎస్సార్ జలకళ పథకం కింద బోరు వేయించుకున్న రైతులకు ఉచితంగా మోటార్ పంపుసెట్లను పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. విశ్వేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై షేక్షానపల్లి, లత్తవరం, ఆమిద్యాల గ్రామాలకు చెందిన తొమ్మిది మంది రైతులకు మోటార్లు, స్టాటర్, పైపులు తదితర పరికరాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజా సంకల్ప పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి అయ్యాక 98 శాతం హామీలు నెరవేర్చారన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని చిన్న, సన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ ద్వారా రూ.5 లక్షల వరకూ ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోందన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ ఉచితంగా బోరు వేయడంతో మోటార్ ఇతర పరికరాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, ఏపీడీ అజయ్‌కుమార్, ఏపీఓ సైలజ, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, సచివాలయ కన్వీనర్లు గుర్రం శ్రీనివాసులు, వెంకటేష్‌నాయక్, నాయకులు రామచంద్రానాయక్, నాగభూషణ, నాగరాజు, ఎల్లప్ప, అయ్యపరెడ్డి రామకృష్ణ, ఓబన్న, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ప్రతిజ్ఞ చేస్తున్న పర్యావరణప్రియులు



మొక్కలను పంపిణీ చేస్తున్న డీఆర్వో లక్ష్మన్న

కళ్యాణదుర్గం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సోషల్ ఫారెస్ట్ కళ్యాణదురం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బ్రహ్మయ్య సూచించారు. స్థానిక కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో స్థానికులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెట్లను నరకడం వల్ల కలిగే అనర్థాలను ప్రజలు గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు పెంచి సంరక్షించాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు.

డి హీరేహాళ్(రాయదుర్గం): మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరు ఐదు మొక్కలు నాటి సంరక్షించాలని రాయదుర్గం అటవీశాఖ డీఆర్వో లక్ష్మన్న సూచించారు. గురువారం డి హీరేహాళ్ తహసీల్దార్ కార్యాలయం వద్ద లైఫ్‌స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమం లో భాగంగా బీట్ ఆఫీసర్ రాజు, ఫారెస్ట్ సిబ్బందితో కలసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు రహంతుల్లా, తహసీల్దార్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతి గిరిజన రైతుకూ సాగు పట్టాలు

వజ్రకరూరు: అర్హులైన ప్రతి గిరిజన రైతుకూ సాగు హక్కు పట్టాలు మంజూరు చేస్తామని గిరిజన సంక్షేమ అధికారి అన్నా దొరై అన్నారు. గురువారం మండలంలోని వెంకటాం పల్లిపెద్ద తండాలో గిరిజన రైతులు సాగుచేస్తున్న అటవీ భూములను అధికారులు పరిశీలించారు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసి అటవీభూములు సాగుచేస్తున్న గిరిజన రైతులకు వెంటనే సాగు హక్కు పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో జిల్లా ట్రైబల్ అధికారులు, ఫారెస్ట్ వెంకటాంపల్లిపెద్దతండాలో పర్యటించి క్షేత్ర స్థాయిలో గిరిజన రైతులు సాగు చేస్తున్న అటవీ భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి గిరిజన రైతుకూ న్యాయం చేస్తామని, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాజీ ఎమ్మెల్యే విశ్వకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కరీముల్లా, అకౌంటెంట్ వెంకటేశ్వర్లు, బీట్ అధికారి సతీష్‌కుమార్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

### మిశ్రమ పంటల సాగుతో లాభాలు

కూడేరు: మిశ్రమ ఆహార పంటల సాగుతో అనేక లాభాలను పొందవచ్చని ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ మండల టీం లీడర్ నారాయణరెడ్డి, విలేజ్ అగ్రి అసిస్టెంట్ రాజకుమార్ సూచించారు. గురువారం కూడేరు మండలంలోని కరుట్లపల్లిలో ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో మహిళా రైతులకు మిశ్రమ ఆహార పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిరు ధాన్యాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. తక్కువ విస్తీర్ణంలో మిశ్రమ ఆహార పంటలు సాగు చేస్తే కొన్ని పంటలు దెబ్బతిన్నా .. మరికొన్ని పంటలైనా ఆదుకుంటాయన్నారు. రసాయనికి ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వాడితే పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మిశ్రమ ఆహార పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది రామలింగ, రామాంజనేయులు, ప్రియాంక, గౌతమి, అక్కమ్మ, శ్రీలత, రమణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రహదారులకు మహర్దశ

- డబుల్ రోడ్లుగా భూపసముద్రం, గలగల రహదారులు
- రూ.26 కోట్ల నిధులు మంజూరు చేసూ జీఓ విడుదల
- ఫలించిన విప్ కాపు ప్రయత్నం

రాయదుర్గం: నియోజకవర్గంలోని గ్రామీణ దారులకు మహర్దశ పట్టింది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చొరవతో ఇప్పటికే రూ.100 కోట్ల నిధులతో పాడుబడ్డ రోడ్లన్నీ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. తాజాగా రాయదుర్గం నుంచి భూపసముద్రం క్లే ప్రధాన రహదారిలో 9 కిలోమీటర్ల వరకూ రూ.13 కోట్లు, రాయదుర్గం చెక్‌పోస్టు నుంచి తాళ్లకెరకు చేరే ప్రధాన రహదారిలో 9.8 కిలోమీటర్ల వరకూ రూ.13 కోట్లు మొత్తం రూ.26 కోట్లతో డబుల్ రోడ్లుగా విస్తరించనున్నారు. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తూ గురువారం జీఓ 131 విడుదల చేసింది. తమ సుదీర్ఘ కల నెరవేరేలా కృషి చేసిన విప్ కాపు, తమ బాధలను అర్థం చేసుకుని నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సింగిల్ రోడ్డు కారణంగా ఇన్నాళ్లు నరకయాతన అనుభవించామని ఈ ఇబ్బందులు తీర్చుతున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామంటూ సంతోషం వ్యక్తం చేస్తూ సోషల్‌మాధ్యమాల్లో పెద్ద ఎత్తున అభినందలు తెలిపారు.

**'కాలవ' ఒక్క రోడ్డేస్తే వందల రోడ్లు మేమేశాం**



కాలవ శ్రీనివాసులు ఏదో ఒక రోడ్డేసినట్టు ఇటీవల ఒక సెల్ఫీ విడుదల చేశాడు. మంత్రిగా ఉండే సమయాన చిత్తశుద్ధితో పని చేసి ఉంటే ఈ నాడు వందలాది రోడ్లు వేసే దుస్థితి తమకు పట్టేది కాదు. ఒక్క రోడ్డేసినోడే ఇంతలా సెల్ఫీలు కొట్టుకుంటే పట్టణం నుంచి గ్రామీణ స్థాయి వరవకు వందలాది బీటీ, సీసీ, తారు రోడ్లు నిర్మించాం. ఎవరు మేలు చేసేవారో, ఎవరో డబ్బా కొట్టుకునే వారో ప్రజలే అర్థం చేసుకోవాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా రోడ్లని తళతళ మంటున్నాయి. రూ. వందల కోట్లు కేవలం రోడ్ల అభివృద్ధికే ఖర్చుచేస్తున్నా కాలవలా చెప్పుకునేందుకు ఏనాడూ ఆరాటపడలేదు. ఇప్పటికే రాయదుర్గం– బళ్లారి రోడ్డును స్టేట్ హైవేలోకి మార్చాం. భవిష్యత్తులో ఆ రోడ్డు విస్తరణకు సైతం కృషి చేస్తాం. ఇంతలా అభివృద్ధి చేస్తుంటే పిచ్చి కుక్కలా కాలవ మొరగడం ఎంతవరకు సమంజసమో అర్థం కావడం లేదు.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్